క్లుప్తంగా

600 పశువులకు టీకాలు



వంతరాంలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని వంతరాంలో 600పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు వేసినట్లు మండల పశువైద్యశాఖ అధికారి గణేష్ సోమవారం తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి లక్షణాలు సోకే అవకాశాలు ఉన్నందున ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేర చేపట్టినట్లు ఆయన తెలిపారు. నోటివెంట చొంగకారడం, నాలికపై బొబ్బర్లు, అధిక జ్వరం, మేత తీసుకోకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, కాలి గిత్తల మధ్య పుళ్లు వంటి వ్యాధి లక్షణాల నివారణకు ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు సిబ్బంది రైతులకు ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూకలవాడలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



నూకలవాడలో క్యాంపు నిర్వహిస్తున్న అధికారులు

బలిజిపేట: మండలంలోని నూకలవాడ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను బలిజిపేట వైద్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి ఈ సందర్భంగా 68మంది రోగులకు వైద్యసేవలు అందించారు. డయాబెటిక్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వేసవికాలం దృష్ట్యా ప్రజలు గొడుగులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వినియోగించాలని సూచించారు. గ్రామంలో ఉన్న పాఠశాల విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎస్వీ రమణ, 108 సిబ్బంది ప్రసాద్, లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న ఏఓ అనురాధ పండా

సాలూరు: అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను ఏఓ అనురాధ పండా సోమవారం పరిశీలించారు. ఈ మేరకు మండలంలోని తోణాం, కురుకూటి, మరిపల్లి పంచాయతీల్లో పర్యటించి నేలరాలిన మొక్కజొన్న, అరటి తదితర పంటలను పరిశీలించారు.ఇందులో ముఖ్యంగా తోణాంలో అధికంగా మొక్కజొన్న పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక నివేదికలో గుర్తించామని చెప్పారు. తోణాం, తుండ తదితర ప్రాంతాల్లో సుమారు 32 ఎకరాల్లోని ఉద్యానవన పంటలు నష్టపోయినట్లు గుర్తించామని మండల హార్టికల్చర్ అధికారిణి ప్రత్యూష తెలిపారు. నష్టనివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.

వాహనాల వేలం



పట్టణ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వేలం పాట

సాలూరు: వివిధ సారా కేసుల్లో పట్టుకున్న వాహనాలకు పట్టణ, రూరల్ స్టేషన్‌లలో ప్రొహిబిషన్ అధికారుల పర్యవేక్షణలో సోమవారం వేలం పాట నిర్వహించారు. పట్టణ స్టేషన్ పరిధిలో 4 ద్విచక్రవాహనాలు, 2 ఆటోలకు వేలం వేయగా 3 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను రూ.96,420లకు ఔత్సాహికులు పాడారని ఎస్‌హెచ్ఓ శ్రీనివాసరావు తెలిపారు. అలాగే రూరల్‌స్టేషన్‌లో 15 ద్విచక్రవాహనాలకు గాను 10 ద్విచక్రవాహనాలను రూ.2,30,500లకు పాడారని, రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు.

మహిళలకు ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులు

పార్వతీపురంటౌన్: పారిశుద్ధ్యం, సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్‌లో ప్రతిభ కనబరచిన మహిళలకు ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత 2023 అవార్డుల కోసం మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పురపాలక సంఘం కమిషనర్ జె.రామఅప్పలనాయుడు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. తడి, పొడి చెత్త సేకరణ, శుద్ధీకరణ, చెత్త సేకరణ చెత్తతో కళాకృతుల తయారీ, తడి చెత్తను ఎరువుగా మార్చి వినియోగించడం తదితర విభాగాల కింద కృషి చేస్తున్న మహిళలు అవార్డులకు అర్హులని పేర్కొన్నారు. అవార్డులకు ఎంపికైన మహిళలకు జూన్ 6వ తేదీన జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో అవార్డులు అందజేస్తారని తెలిపారు. ఇతర వివరాల కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. మురళి, సెల్ నంబర్ 6305080193ను సంప్రదించవలసినదిగా సూచించారు.

నోటి శుభ్రతపై అవగాహన అవసరం

● డీఎంహెచ్ఓ డాక్టర్ బగాది జగన్నాథరావు

పార్వతీపురంటౌన్:

నోటి శుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు సూచించారు. ప్రపంచ నోటి శుభ్రత వారోత్సవాల (వరల్డ్ ఓరల్ హెల్త్ డే) ముగింపు సందర్భంగా జిల్లా ఆస్పత్రి నుంచి 'ర్యాలీ'ని డీఎంహెచ్ఓ సోమవారం ప్రారంభించారు. జిల్లా ఆస్పత్రి నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్ వరకు 'బి ప్రౌడ్ అఫ్ మౌత్' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. మార్చి 13 నుంచి మార్చి 20 వరకు జరిగిన 'నోటి శుభ్రతా వారోత్సవాల'లో భాగంగా విద్యాసంస్థలు, అనాథాశ్రమాలు తదితర సంస్థలలో ఉచిత డెంటల్ మెడికల్ క్యాంప్‌ను నిర్వహించామని ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ తెలిపారు. నోటి ఆరోగ్యం చక్కగా ఉండేందుకు రోజూ రెండు సార్లు బ్రష్ చేయాలని సూచించారు. బ్రష్ చేసే విధానాన్ని తెలుసుకోవాలన్నారు. నోటి కేన్సర్, పొగతాగుట, మద్యం తాగడం, ఖైనీలు, గుట్కాలు నమలడం వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు. ప్రతి 6 నెలలకు ఒకసారి డెంటల్ డాక్టర్ వద్దకు వెళ్లి పరీక్షించుకోవలని సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.వాగ్దేవి, టీబీ జిల్లా నియంత్రణ అధికారి డా. ఎ.శ్యామ్‌కుమార్, డాక్టర్ శేషగిరి, దంత వైద్యులు డాక్టర్ ఆర్. శ్యామల, కె. సౌజన్య, డాక్టర్ దినేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బగాది జగన్నాథ రావు



సాలూరు: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

నోటిశుభ్రతతో వ్యాధులకు దూరం..

సాలూరు: నోటిశుభ్రతతో చాలా వరకు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని స్థానిక ఏరియా ఆస్పత్రి దంతవైద్యురాలు డాక్టర్ రమ్య అన్నారు.ప్రపంచ నోటిశుభ్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రోజుకు రెండు సార్లు బ్రష్ చేయాలని సూచించారు. ఖైనీ, గుట్కా, మద్యపానం, పొగతాగడం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. నోటి నుంచి దుర్వాసన రాకుండా పాటించవలసిన నియమాలు, దంత సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపరిండెంట్ వేణు, ఆర్‌ఎంఓ రత్నకుమారి, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు



పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రావణ్

బలిజిపేట: రెండు రోజుల పాటు కురిసిన వర్షంతో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఏఓ శ్రావణ్ తెలిపారు. పంటనష్టం వాటిల్లిన గ్రామాలలో ఆయన సోమవారం పరిశీలించారు. 55-60రోజుల సమయంలో ఉన్న మొక్కజొన్న పొలంలో నీరు నిల్వ ఉంటే ఆనీరు బయటకు పోయే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. వరుసలలో గొప్పు తవ్వించాలి. బూస్టర్ డోస్‌గా 50కిలోల యూరియా, 20-25కిలోల పొటాష్ కలిపి వేయాలి. వర్షాల తరువాత తెగులు సోకేఅవకాశాలు ఉన్నందున హెక్సకొనాజోల్ 400ఎంఎల్ లేదా ప్రొపికొనాజోల్ 200ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేయడం వల్ల ఎండు, ఆకుమచ్చతెగులును నివారించవచ్చని హితవు పలికారు. నేలకు ఒరిగిన పంటను రైతుభరోసా కేంద్రం సిబ్బంది అంచనా వేస్తారని చెప్పారు. ప్రాథమికంగా 202ఎకరాలలో పంట నష్టం జరగవచ్చని అంచనా వేసినట్లు తెలిపారు. గింజలు మొలకలు రాకుండా ఉండడానికి 5శాతం ఉప్పుద్రావణం కంకులపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. పంట నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలలకు దశలవారీగా బిల్లులు

సీతానగరం: మండలంలోని గోశాలల నిర్వాహకులకు బిల్లుల చెల్లింపులు దశల వారీగా జరుగుతున్నాయని ఎఆర్‌ఈజీఎస్ జేఈ కృష్ణ తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల గోశాలలు నిర్మించుకున్న లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో బిల్లుల డబ్బులు నేరుగా జమఅవుతున్నాయని చెప్పారు. మండలంలో గోశాలలు నిర్మించిన 170 మంది లబ్ధిదారుల బ్యాంక్‌ఖాతాలకు తొలి దశలో బిల్లులు జమ అవుతాయని, మిగతా లబ్ధిదారులు ఇచ్చిన బ్యాంక్ ఖాతా నంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ నంబర్లు, ఆధార్ నంబర్ లింక్ చేయకపోవడం తదితర కారణాల వల్ల బిల్లుల చెల్లింపులో ఆలస్యమవుతోందన్నారు. వాటన్నిటినీ సరిచూసుకుని నెలాఖరునాటికి బిల్లులు పడేవిధంగా సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. లబ్ధిదారులు బిల్లుల కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, బిల్లులు అందని వారు మంజూరు నిమిత్తం సిబ్బందికి అవసరమైన సమాచారం ఇవ్వాలని కోరారు.

సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జోగారావు

● నియోజక వర్గ సమస్యలపై ప్రస్తావన

పార్వతీపురంటౌన్: పార్వతీపురం నియోజకవర్గ సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు తీసుకువెళ్లారు. ఈ మేరకు సోమవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, దీర్ఘకాలిక పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసేందుకు, అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై సీఎం జగన్‌మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందించి నియోకవర్గ అభివృద్ధికి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే సాక్షికి తెలిపారు.

దళిత సమాజంపై దాడి

వైఎస్సార్‌సీపీ దళిత ఎమ్మెల్యే సుధాకర్‌పై అసెంబ్లీ సాక్షిగా టీడీపీ నేతలు చేసిన దాడి దళిత జాతి, దళిత సమాజంపై దాడి అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. అసెంబ్లీలో దాడి చేసి దళితులను అవమానపరిచారన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు దాడి చేసి అగౌరవ పరిచినట్లు వారి అనుకూల మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని, దళితులను రాజకీయంగా ఆర్థికంగా ఎదగకుండా సమాధి చేయాలని చంద్రబాబు భావిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ దళిత ఎమ్మెల్యేలు అంతా టీడీపీ కుట్రలను తిప్పికొడుతూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలుపుతామని చెప్పారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే జోగారావు

ఘనంగా వరల్డ్ ఓరల్ హెల్త్ డే



సీతంపేట: కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్య సిబ్బంది

సీతంపేట: మండల కేంద్రంలో వరల్డ్ ఓరల్ హెల్త్ డే(ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం) కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొని, నోటి పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతిరోజూ రెండు పూటలా బ్రష్ చేయాలని, నోటితో పాటు దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరిండెంట్ బి.శ్రీనివాసరావు, వైద్యాధికారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: వరల్డ్ ఓరల్ హెల్త్ డే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో సామాజిక ఆరోగ్య కేంద్రం డెంటల్ అసిస్టెంట్ సర్జన్ ఆర్.సుకృత పాల్గొని, నోరు, దంతాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అతి శీతల, వేడి పానీయాలు, పదార్థాలు తినవద్దన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విధిగా బ్రష్ చేసుకుని, పళ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీహెచ్‌సీ సిబ్బంది నోటి దుర్వాసన, పళ్లు పాడవ్వకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కూల్‌డ్రింక్స్, వేడి పదార్థాలు ఎక్కువగా తీసుకోవద్దన్నారు. రోజూ ఉదయం, సాయంత్రం బ్రష్ చేసుకుని, పళ్లను శుభ్రపరుచుకోవాలన్నారు.

నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి మెంటిపేట ఎస్సీకాలనీకి చెందిన దేవులపల్లి వెంకటేష్ మృతికి కారణమైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మెంటిపేట కాలనీలో సోమవారం నిరవధిక ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయపోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, కేఎన్‌పీఎస్ జిల్లా కన్వీనర్ నల్లబారికి గురుమూర్తి, బీఎస్‌పీ జిల్లా నాయకులు బి.బుద్ధుడు మాట్లాడుతూ రెల్లి కులస్తుడైన వెంకటేష్ హత్యకు కారణమైన వారిని అరెస్టు చేయడంలో సీఐ, ఎస్సైలు కావాలనే జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. హంతకులపై హత్యానేరంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, కేసు దర్యాప్తు వేగవంతం చేసి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతిపాదిత పనులపై సమీక్ష



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ జగన్మోహనరావు

బలిజిపేట: బలిజిపేట, అరసాడ పీహెచ్‌సీలకు రెండవ విడతలో ప్రతిపాదించిన పనులపై జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు సోమవారం సమీక్షించారు. బలిజిపేట పీహెచ్‌సీకి రెండవ విడతలో రూ..38లక్షలు, అరసాడ పీహెచ్‌సీకి రూ.32లక్షలతో అదనపు పనులకు ప్రతిపాదనలు చేశారు. ఆ పనులపై సమీక్ష నిర్వహించి వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఈ సందర్భంగా డీఐఓ తెలిపారు. అనంతరం పీహెచ్‌సీలో రివ్యూ నిర్వహించారు. యాప్‌లపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యాక్సిన్ నిల్వలు పరిశీలించి వాటిపై తేదీలు కచ్చితంగా ఉన్నదీ లేనిది తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. గర్భిణులు, బాలింతల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పీహెచ్‌సీ సిబ్బందికి వివరించారు. రోగులకు సరైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి మహీపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల తనిఖీ



విద్యార్థులు పరీక్షల రాస్తున్న తీరును సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్న ఎస్‌హెచ్ఓ శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలోని రెండు కేంద్రాల్లో జరుగుతున్న ఇంటర్మీయట్ పరీక్షా కేంద్రాలను డీవీఈఓ మంజులా వీణ తనిఖీ చేశారు. ఈ మేరకు పరీక్షలు జరుగుతున్న జోగింపేట గిరిజన ప్రతిభా(స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్) విద్యాలయం, సీతానగరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షల అబ్జర్వర్‌గా విధులు నిర్వహిస్తున్న డీవీఈఓ మంజులా వీణ సోమవారం తనిఖీచేసి పరీక్షలు నిర్వహిస్తున్న రెండు కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్సై కె.నీలకంఠం పరీక్షా కేంద్రాలను పరిశీలించి సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలియజేశారు.

స్కూల్‌ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో 9 మంది గైర్హాజరు..

మండలంలోని జోగింపేట స్కూల్‌ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో సోమవారం 299 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 290 మంది హాజరైనట్లు, 9 మంది గైర్హాజరైట్లు పరీక్షల చీఫ్ సూపరెంటెండెంట్ పి.వెంకటనాయుడు తెలియజేశారు. అలాగే సీతానగరం జీజే కాలేజీలో 377 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 70 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరెంటెండెంట్ బి.రేణుక తెలియజేశారు.

సాలూరులో పరిశీలించిన ఎస్‌హెచ్ఓ

సాలూరు: పట్టణంలోని ఇంటర్మీడియట్ పరీక్షాకేంద్రాలను ఎస్‌హెచ్ఓ శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, సత్యసాయి,వాసవి పరీక్షా కేంద్రాలకు ఆయన వెళ్లి ఏర్పాట్లను పరిశీలించి పరీక్షల నిర్వహణపై ఆరా తీశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిబంధనలకనుగుణంగా జరగాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్‌లో పదోతరగతి ప్రశ్నపత్రాలు



సీతానగరం: పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ జి సూరిదేముడు.

సీతానగరం: ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు పోలీస్‌స్టేషన్‌లో భద్రంగా ఉన్నాయని ఎంఈఓ జి సూరిదేముడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రశ్నపత్రాలను పరిశీలించామని చెప్పారు. ప్రశ్నపత్రాల సెట్ 1 ఆదివారం వచ్చాయని, సోమవారం సెట్ 2 ప్రశ్నపత్రాలు వచ్చాయని తెలియజేశారు. వరుసగా రెండు రోజులూ వచ్చిన ప్రశ్నపత్రాలు పదోతరగతి పబ్లిక్ పరీక్షల నిర్వాహకులు, మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పోలీస్‌స్టేషన్‌లో భద్రపర్చినట్లు తెలియజేశారు.

పది ప్రశ్నపత్రాలు భద్రం

బలిజిపేట: పదవ తరగతి ప్రశ్నపత్రాలు బలిజిపేట పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. బలిజిపేట పోలీస్‌స్టేషన్‌కు సోమవారం సెట్-2ప్రశ్నపత్రాలు వచ్చాయి. ఆదివారం సెట్-1 ప్రశ్నపత్రాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్‌కుమార్, రూట్ ఆఫీసర్ సూరిదేముడు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



బలిజిపేట: పోలీస్‌స్టేషన్‌లో భద్రపరుస్తున్న ప్రశ్నపత్రాలు

రెండు వారాలకు మించిన దగ్గు క్షయ కావచ్చు



మాట్లాడుతున్న టీబీ సూపర్‌వైజర్ నరేష్

సాలూరు: రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం క్షయ వ్యాధి కావచ్చని టీబీ సూపర్‌వైజర్ నరేష్ స్పష్టం చేశారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని జనవరివలసలో ఏపీసీడ్స్ గోదాంలో కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, దగ్గేటప్పుడు కఫం ద్వారా రక్తపు జీరలు పడడం టీబీ వ్యాధి లక్షణాలని వివరించారు. ఈ లక్షణాలు సోకిన వ్యక్తులు స్థానిక వైద్యారోగ్య సిబ్బంది ద్వారా ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించి కఫం పరీక్ష చేసుకోవాలని సూచించారు. పోషకాహార లోపాలవల్ల అంటువ్యాధి, రక్తహీనత వస్తుందని తెలిపారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థి డిబార్

కురుపాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్(చూసిరాత)కు పాల్పడిన ఓ విద్యార్థిని అధికారులు డిబార్ చేశారు. సోమవారం జరిగిన సివిక్స్ పరీక్షలో కురుపాం కళాశాలకు చెందిన విద్యార్థి చూసిరాతకు పాల్పడడంతో అతడిని డిబార్ చేసినట్లు పరీక్షల నిర్వహణ చీఫ్ సూరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ తెలిపారు.

ప్రతి గ్రామంలో వైద్య సేవలు



ఎమ్మార్‌నగరంలో ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారి అనూష

పార్వతీపురంటౌన్: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారిణి అనూష అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని ఎమ్మార్‌నగరం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రతి నెలలో రెండుసార్లు నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులు అందజేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో మంచాన పడి ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలను అందిస్తున్నామని, గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తోందని సంతృప్తి వ్యక్తం చేశారు. రోగాల బారిన పడి గ్రామాల్లో ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశంతో నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నామని, ప్రజలంతా ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

24న పంచాయతీ షాపుల వేలంపాట

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీ పరిధిలోని పంచాయతీ షాపులకు సంబంధించి, ఈ నెల 24వ తేదీన బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నామని ఈఓ రామచంద్రరావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. బస్సు, కారు స్టాండ్‌లతో పాటు పాతబస్టాండ్‌లోని ఆరు షాపులు, తొమ్మిదో నంబర్ ప్లాట్, పదో నంబర్ ప్లాట్, పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న మరో ఎనిమిది షాపులకు వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు అదేరోజు ఉదయం 11 గంటలకు రావాలని, మధ్యాహ్నం 2 గంటలకు టెండర్లు తెరవబడునని వెల్లడించారు.

రక్తహీనత బాధిత విద్యార్థులకు
ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు

● డీఎంహెచ్ఎ జగన్నాథ రావు

పార్వతీపురంటౌన్:

రక్త హీనత బాధిత విద్యార్థులతో ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు మింగించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథ రావు అన్నారు. రక్తహీనత (ఎనీమియా)తో బాధ పడుతున్న ప్రతి విద్యార్థితో ప్రతిరోజూ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు మింగేలా చూడాలని ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. విద్యా సంవత్సరం ముగుస్తున్న తరుణంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించడంపై ప్రోగ్రాం అధికారులతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఎనీమియా ముక్త్ భారత్ ప్రోగ్రాంలో భాగంగా ప్రోగ్రాం అధికారులు గర్భిణు, బాలింతలకు హీమోగ్లోబిన్ పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, ఎన్‌సీడీ పేషంట్స్ అందరినీ తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కర రావు, ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి జగన్నాథ రావు